www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 మే 2023
5
తిరుపతి

గంగమ్మ ఆలయంలో శ్రీ సిద్దేశ్వరానంద భారతి స్వామి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కుర్తాళం శంకరాచార్యులు, శ్రీశక్తి పీఠ వ్యవస్థాపక పరమాచార్యులు శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి, మంత్ర మహేశ్వరి శ్రీ రమ్యానంద భారతి స్వామి శనివారం మధ్యాహ్నం శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణ చేశారు. డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గోపి యాదవ్, ఈవో ముని కృష్ణయ్య పాల్గొన్నారు.

వామ్మో కు(పి)క్కలు...!

- రోజుకు 30పైనే బాధితులు
- నిద్రపోతున్న మున్సిపల్ శాఖ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణ ప్రజలను శునక సమూహాలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. కనపడిన వారి పిక్కలు కొరికి ఆస్పత్రి పాలుచేస్తున్నాయి.. వీధిలో మంచి కుక్కలేవా..? పిచ్చికుక్కలేవా..? తెలియక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఎందుకైనా మంచిదని ఆసుపత్రులకెళ్లి ర్యాబీస్ రాకుండా సూదులు పొడిపించుకుంటున్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి రోజుకు సగటున 20-30పైనే కుక్క కాటు బాధితులొస్తున్నారంటే వీటి సమూహ హేల నోటి లాఘవం ఏ పాటిదో ఇట్టే అర్థమవుతోంది. కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలై అవస్థాపక స్థితికి చేరుకున్నవారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో వీధి శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో శ్రీరామ్ నగర్ కాలనీ వాసులు బిక్కు, బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వీధి శునకాలు స్వైర విహారం చేస్తున్న శ్రీరామ్ నగర్ కాలనీలోనే అధికార పార్టీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉండడం గమనార్హం.

నివారణ చర్యలు శూన్యం

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు మున్సిపాల్టీలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టక పోవడంతో అవి ఇంతింతై వటుడింతై అన్నట్లు వేల సంఖ్యలో తమ సంతానాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. కుక్కలే కాదు కోతులు, పందుల నివారణలో సైతం ఇదే నిర్లక్ష్య ధోరణి ఉండటంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. వీధి కుక్కలు, పందులు, కోతుల నుంచి ప్రజలకు ముప్పు పొంచి ఉన్నప్పుడు క్రమ తప్పకుండా వాటి నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అదే విషయాన్ని నేషనల్ హెల్త్ మిషన్ స్పష్టం చేస్తోంది. అందుకోసం మున్సిపాల్టీలకు, గ్రామాల్లో నిధులు కేటాయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఆ దిశగా ఈ నాలుగేళ్లలో అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. సాధారణంగా ఒక్క కుక్క ఎనిమిది నెలల కాలంలోనే క్రాసింగ్కు వచ్చి సంతానోత్పత్తిని పెంచుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని వెటర్నరీ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్క ఆడ కుక్క ఏడాదికి రెండు ఈతల ద్వారా 20 నుంచి 30 పిల్లలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుంది. దీన్ని దష్టిలో పెట్టుకుని శునక అధికారులు క్రమం తప్పకుండా కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా వేసవికి ముందు ఈ కార్యక్రమాన్ని చేపడితే సత్ఫలితాలనిస్తాయని అధికారులు చెబుతున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాల్టీలో అరకొరగా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టిన పరిస్థితి. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ఏటా కుక్కలు, పందులు, కోతుల పట్టేందుకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే చెబుతున్న లెక్కలకు.. నివారణ చర్యలకు పొంతన లేకుండా పోతోంది. ఏడాది కిందట శ్రీకాళహస్తి మున్సిపాల్టీలో 700 కుక్కలను పట్టి రేణిగుంట సమీపంలో ఉన్న అనిమల్ కేర్ ఫండ్ అనే ప్రైవేటు కంపెనీలో వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించారు. అందుకోసం రూ.5 లక్షలు ఖర్చు చేశారు. పట్టణంలో ఇంకా రెండు వేలకు పైగానే వీధి కుక్కలు ఉన్నాయి. అయితే వాటి నివారణకు ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడం బాధాకరం. మున్సిపాలిటీలో నిధులు లేకపోవడం మూలానే కేటాయింపులు జరగలేదన్న విమర్శ ఉంది. అర్బన్ హెల్త్ కేంద్రాల్లో కుక్క కాటుకు వినియోగించే ఇంజక్షన్ల కొరత ఉండడంతో ఎక్కువమంది ఆసుపత్రికి వస్తున్నట్లు సమాచారం. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్, ఎన్జీఆర్ నగర్, ముత్యాలమ్మగుడి వీధి, తెలగాసిని కాలనీ, బహదూర్పేట, పూసలవీధి, బీపీ అగ్రహారం, మంచినీళ్లగుంట, కుమ్మరివీధిలో అధికంగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు గుర్తించారు. అదే విధంగా తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం, ఏర్పేడు, నెల్లూరు జిల్లాలోని పెళ్లకూరు మండలం నుంచి కుక్కకాటు కేసులు అధికంగా నమోదవుతున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కకాటుకు అమాయక ప్రజలు బలికాకుండా సత్వర నివారణా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మండు వేసవిలో... కార్పొరేట్ క్లాసులు

- వడగాల్పులతో విద్యార్థులు డీలా
- పట్టించుకోని విద్యాశాఖ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

కార్పొరేట్ కళశాలల యజమాన్యలు బరితెగిస్తున్నాయి. మండు వేసవిలో క్లాసులు పెట్టి విద్యార్థులతో మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి.. వడగాల్పులతో ఊపిరాడక, ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేసవి సెలవుల్లో ఎటువంటి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ చెబుతున్నా కార్పొరేట్ సంస్థలు లెక్కచేసే పరిస్థితి లేదు. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయి. పదో తరగతి ఫలితాలు వెలువడక ముందు నుంచే ఇంటర్ ఫస్టియర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఏసీ క్యాంపస్‌ల పేరుతో తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఓ వైపు ఏసీలు పనిచేయకపోవడంతో విద్యార్థులు ఉక్కబోతతో అల్లాడుతున్నారు. ఉదయం 7.30 నుంచి రాత్రి 7.30 వరకూ 12 గంటల పాటే ఏకదాటిగా తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యలో లంచ్ చేయడానికి 40 నిమిషాల సమయాన్ని ఇస్తున్నారు. మిగిలిన సమయమంతా తరగతుల్లో విద్యార్థులు ఉండాల్సిందే. 12 గంటల పాటు కంటిన్యూస్‌గా పాఠాలు వినడానికి విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు.

నిబంధనలు గాలికి

నివాసాలకు అనుగుణంగా నిర్మించిన ప్లాట్‌లలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించిన దాఖలాలు లేవు. నిబంధనల మేరకు ఇంటర్ తరగతులు జూన్ మొదటివారం నుంచి ప్రారంభించాల్సి ఉంది. అయితే టెన్త్ పరీక్షలు ముగియగానే వారం రోజులు సెలవులు ఇచ్చి వెంటనే తరగతులు ప్రారంభించడం గమనార్హం. పదో తరగతి ఫలితాలు ఈనెల ఆరో తేదీ విడుదల కాగా ఇంటర్ ఫస్టియర్ తరగతులు ఫలితాలు రాక ముందు నుంచే ప్రారంభించేశారు. అధికారుల హెచ్చరికలు కార్పొరేట్ యాజమాన్యాలు పట్టించుకునే పరిస్థితి లేదు. దీనికి తోడు ఫీజులు సైతం లక్షల్లో కట్టించుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇంటర్ అయ్యేసరికి రెండు లక్షల ఫీజు సమర్పించాల్సిందే. ఇక హాస్టల్ అయితే మరో రెండు లక్షలు అదనం. ఐఐటి, జెఇఇ పేర్లతో భారీ ఎత్తున ప్రచారంతో కాలేజీలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు సైతం అప్పులు చేసి మరీ తమ పిల్లల భవిష్యత్ కోసం కష్టాలు పడుతూ ఆయా కాలేజీల్లో చేర్పిస్తున్నారు. మొత్తం ఫీజు చెల్లిస్తేనే విద్యార్థులకు అవసరమైన సర్టిఫికేట్లను ఇస్తారు. లేదంటే వేధింపులు షరా మామూలే.

కర్ణాటక ఫలితాలతో బిజెపి పతనం ప్రారంభం

తిరుపతిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశంలో బిజెపి పరిపాలనపై ప్రజలు మార్పు కోరుతున్నారన్న సంకేతం కర్ణాటక ఎన్నికల ఫలితాలతో స్పష్టమైందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. శనివారం కర్ణాటకలో ఎన్నికల కౌంటింగ్ లో కాంగ్రెస్ పార్టీ అనూహ్య రీతిలో విజయం వైపు అడుగులు వేస్తుండడంపై తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చాలా కాలం తర్వాత ఆనందోత్సాహాల మధ్య విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. యార్లపల్లి గోపి, లీగల్‌సెల్ అధ్యక్షుడు రవి, తేజోవతి, శాంతి యాదవ్, సుబ్బలక్ష్మి, వెంకటేష్ గౌడ్, ఏయూడబ్ల్యూఇసి జిల్లా అధ్యక్షులు పోతుల భాస్కర్, ఎస్టి సెల్ జిల్లా చైర్మన్ సిద్దయ్య, బీసీ సెల్ రమణాచారి, ఎస్సీ సెల్ నరేంద్రబాబు, బాబు రాయల్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

బిజెపి పతనం ఆరంభం : చిట్టిబాబు

కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల్లో 136 అసెంబ్లీ స్థానాలను దక్కించుకొని స్వతహాగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తిని సాధించిందని, ఇక బిజెపి పతనం ఈ గెలుపుతో ప్రారంభమైందని పీసీసీ ఎస్సీ విభాగం కో చైర్మన్ గౌడపేరు చిట్టిబాబు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న సందర్భంగా గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అలిపిరి వద్ద 101 కొబ్బరికాయలను కొట్టి శ్రీ వెంకటేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి దురహంకార వైఖరికి, మతోన్మాద పోకడలను దేశ ప్రజలు ఏ మాత్రం క్షమించరని అందుకు తాజా ఫలితాలే నిదర్శనమన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివశంకర్, నాయకులు కేశవులు, అంకయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో.. కర్ణాటక ఎన్నికల ఫలితాలు నిరంకుశ మోదీ ప్రభుత్వ పతనానికి నాందిగా చూడాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ బత్తెయ్య నాయుడు అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఆ పార్టీ శ్రేణులు పట్టణంలోని నాలుగు మాడా వీధుల్లో సంబరాలు చేసుకున్నాయి. ఎస్.కె.జానీ బాషా, బి.విజయ్ శేఖర్, టి .శివయ్య, ఈ. గోపి పాల్గొన్నారు.

ఎన్ని 'కల' జాతర

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి గంగజాతరకు రాయలసీమలోనే ఓ ప్రత్యేకత ఉంది. తెలంగాణలో సమ్మక్క-సారక్క జాతర ఎలాగో, తాతయ్యగుంట గంగమ్మ తిరునాళ్లు ప్రతి ఏటా వేడుకగా నిర్వహిస్తారు. కొన్ని శతాబ్దాల క్రితం తిరుపతి కుగ్రామంగా ఉన్న సమయంలో గ్రామ దేవతగా గంగమ్మ ఆవతరించిందని పురాణ గాథ. ఈమె స్వయాన తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారికి తోబుట్టువు. దాదాపు 500 సంవత్సరాల నుంచి తిరుపతి గంగమ్మజాతర నిర్వహిస్తున్నారు. ఈమెతో పాటు తాళ్లపాక పెద్దగంగమ్మ, వేషాలమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, అంకాలమ్మ, నడివీధి గంగమ్మకు జాతర చేయడం ఆచారం. సాధారణంగా గంగమ్మ ఆలయానికి ప్రధాన ఆదాయం హుండీదే. అనంతరం వివిద సేవలు, అమ్మవారికి భక్తులు మొక్కుల రూపాన చెల్లించిన వస్త్రాలు, చెంబులు, వెండి, రాగి పాత్రలు తదితర వాటిని వేలం వేసి ఆ వచ్చిన సొమ్ముతో పాటు దాతలు ఇచ్చే డబ్బులతో ప్రతి ఏటా జాతర చేసేవారు. కానీ ఈ ఏడాది దానికి భిన్నంగా సాగుతోంది. హుండీ ఆదాయం, దాతలు సొమ్ము, వేలం ద్వారా వచ్చే నగదుకు అదనంగా అధిక సొమ్మును పోగు చేశారు. తిరుపతికి చెందిన అధికారపార్టీ శాసనసభ్యులు అమ్మవారికి గుడి పునర్నిర్మాణం చేయాలని తలిచి, అనుకున్నదే తడువుగా, టిటిడి, కార్పొరేషన్ సహకారంతో యుద్ధ ప్రతిపాదికన కేవలం నెలల వ్యవధిలోనే గుడిని పూర్తి చేశారు. అంతకు ముందు తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మెప్పించి, ఒప్పించి తాతయ్యగుంట గంగమ్మ దర్శనం చేయించారు. తిరుపతి చరిత్రలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి అమ్మవారును దర్శించుకోవడం అదే ప్రథమం. ముఖ్యమంత్రి స్థానంలో అమ్మవారిని దర్శించుకున్న తొలివ్యక్తిగా జగన్మోహన్‌రెడ్డి నిలిచారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకరమే జరిగిందన్నది తిరుపతి వాసుల అభిప్రాయం. తిరుపతి సమీప ప్రాంతంలో పుట్టి, తిరుపతిలోనే తన ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి, ఇక్కడ నుంచే రాజకీయ అరంగ్రేటం చేసి, చివరకు తనతల్లిదండ్రుల చివర దశను సైతం తిరుపతిలోనే ఉండేలా చేసిన, 40సంవత్సరాల ఇండస్ట్రీగా సుపరిచితులు, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడు సైతం అధికారంలో ఉండగా ఈ గుడిపక్కకు కూడా తొంగి చూడకపోవడాన్ని అధికార పార్టీ అస్త్రంగా చేసుకుంది. అందుకే సిఎంస్థాయిలో జగన్‌ను ఆలయాన్ని రప్పించారు. అనంతరం సిఎం తిరుపతి గంగజాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. ఇక్కడ వరకు అంతా బాగానే ఉంది. ఆ తర్వాతే అసలు కథ ప్రారంభమైంది. తిరుపతి గంగమ్మను త్వరలో జరగబోవు ఎన్నికలకు ప్రచార ఆయుధంగా వాడుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంగజాతర రాష్ట్ర పండగ కావడంతో జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి కార్పొరేషన్, తుడా, టిటిడి తలో ఓ చేయి వేసి నిధులను కేటాయించింది. దీంతో అంగరంగ వైభవంగా జాతర జరగాలని అందరూ బావించారు. దీన్ని అధికార పార్టీ సభ్యులు సొమ్ముచేసుకున్నారు. గంగ జాతరను ఎన్నికల ప్రచార జాతరగా మార్చేశారు. వాడ వాడల, వీధి వీధిన ఏప్రిల్ చివరి వారం నుంచే అమ్మవారి బ్యానర్లు, ప్లెక్సీలు, కటౌట్లు వెలిసాయి. వాటన్నిట్లో అమ్మవారితో పాటు స్థానిక శాసనసభ్యుడి ప్రిరూపం తప్పని సరి చేశారు. సాధారణంగా దేవుళ్ల తిరునాళ్లు, బ్రహ్మోత్సవాలు చేసేటప్పుడు దేవుళ్ల ఫోటోలు, ఆలయ చిత్రాలు వేయడం ఆనవాయితీ. ఈ సారి అందుకు భిన్నంగా ఎంఎల్‌ఏ ఫోటోతో కూడిన ప్లెక్సీలు, పోస్టర్లు తిరుపతి నగరమంతా వెలిశాయి. సుమారు 2 లక్షలకు పైగానే పోస్టర్లు వెలిసాయంటే అతిశయోక్తి కాదు. ఈ సొమ్మంతా ఆలయానిదే కావడం గమనార్హం. ఇది చాలదన్నట్టు అధికార పార్టీ నాయకులు మరో అందుగు ముందుకేసి ఇంటింటికి సారె, పసుపుకుంకమ పేరుతో మరో ప్రచారానికి తెరలేపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రముఖులు ఎస్‌ఫి, కలెక్టరు, జాయింట్ కలెక్టరు, కార్పొరేషన్ కమీషనర్, మేయరు, డిప్యూటీ మేయర్లు, మంత్రులు, ఇతర శాసనసభ్యులు, అధికారులు, ప్రముఖులు సారె యాత్ర చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సారె ఊరేగింపులకు ఒక్క వీధి నుంచి 2 నుంచి 3 వేల మంది వచ్చేలా పథకం వేసి, దేవుడి పేరుతో ప్రచారానికి పూనుకున్నారు. పురాతన ఆచారాలు, సాంప్రదాయాలకు నిదర్శనమైన గంగ జాతరను అందుకు భిన్నంగా అధికార పార్టీ చేయడంపై స్థానికులే పెదవి విరుస్తున్నారు. ఇది గంగ జాతరా, అధికార పార్టీ ఎన్నికల జాతరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేయడం గమనార్హం.

ప్రజాదృష్టి

వైసీపీ అరాచకాలపై బీసీల పోరుబాట

తిరుపతి(మంగళం): రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలకు చేసిన మోసంపై ఈనెల 18వ తేదీ నుండి 22 వరకు రాష్ట్రంలోని బీసీలందరిని ఏకం చేసి పోరుబాట నిర్వహిస్తున్నట్లు టిడిపి తిరుపతి పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్ పెట్టానని చెప్పుకునే సీఎం ఇందులో ఏ కార్పొరేషన్‌కు న్యాయం చేశారో చెప్పాలన్నారు. దొరస్వామి ఆచారి, మిన్నల రవి పాల్గొన్నారు.

వంశీకళాక్షేత్రంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటి: మహతి ఆడిటోరియం వేదికపై చెప్పులతో తిరుగుతూ ఆధ్యాత్మికతను మరిచిన వంశీకళాక్షేత్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జెన్ అకాడమీ నాయకులు కిరణ్ డిమాండు చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీల్లో వంశీకళా క్షేత్రం, మెగాస్టార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహతి ఆడిటోరియంలో ఓ కార్యక్రమం నిర్వహించారన్నారు. మహతి వేదికను పవిత్రంగా భావిస్తూ కళాకారులు, ప్రముఖులు సైతం చెప్పులు వేసుకోరని, కానీ వంశీకళాక్షేత్రం నిర్వాహకులు తమ ప్రచార ఆర్భాటాలకు పరిమితమై చెప్పులతో వేదికపై తిరుగుతూ, పక్కనే శ్రీవారి చిత్రపటాలు ఉన్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

నేడు గ్రూప్-2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

తిరుపతి టౌన్ : తిరుపతిలో ఆదివారం సాయంత్రం మూడు గంటలకు గ్రూప్ 2 ఉచిత అవగాహన సదస్సు డివైఎఫ్ఐ, శ్రీ విద్య ఐ.ఎ.ఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరగనుంది. పోటీ పరీక్షల నిపుణులు, కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన సిలబస్‌ను వివరించనున్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర మాట్లాడుతూ ఈ సదస్సు గ్రూప్ టు పరీక్ష రాయబోయే విద్యార్థులందరికీ బాగా ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక భారతదేశం చరిత్ర అనే 100పేజీల పుస్తకాన్ని ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

బిర్యానీ బ్రాండ్..చిల్లీస్

- నేడు 14వ వార్షికోత్సవం
- 'ఉపాధి' కల్పించాలన్నదే లక్ష్యం
- గంగజాతర సందర్భంగా 'అంబలి' కేంద్రాలు
- 'ప్రజాశక్తి'తో రెస్టారెంట్ అధినేత అంజి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

'రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు ఆకలి విలువ, ఆహారం ప్రాధాన్యత తెలుసు.. ఉన్నత చదువులు చదివినా ఒకరికింద పనిచేయడం ఇష్టం లేదు.. అందుకే హోటల్ మేనేజిమెంట్ కోర్సు చేసి సొంతంగా చిల్లీస్ రెస్టారెంట్ ప్రారంభించాను.. వేలాదిమంది ఆకలి తీరుస్తూ, వందలాదిమందికి ఉపాధి కల్పిస్తున్నానన్న తృప్తి చాలు.. అంచెలంచెలుగా బ్రాంచిలను విస్తరిస్తూ సమాజ సేవ చేయడమే కాకుండా, సమసమానత్వం కోసం నావంతు సహాయ సహకారాలు అందిస్తున్నాను.. గంగజాతర సందర్భంగా అంబిలి కేంద్రాల వద్ద వేలాది మందికి ఉచితంగా అంబిలి అందిస్తున్నాం.. వార్షికోత్సవం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు ఇచ్చేందుకు అన్నీ సిద్ధం చేశాం' అని చిల్లీస్ రెస్టారెంట్ అధినేత వైకుంఠం వీరాంజనేయులు చెప్పారు. రెస్టారెంట్ 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'ప్రజాశక్తి'తో ఆయన రెస్టారెంట్ విశేషాలను వివరించారు. ఆయన మాటల్లోనే..

నేను బతుకుతూ పది మందికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాను. ధనార్జనే ధ్యేయంగాకాకుండా సమాజ సేవలోనూ నా వంతు కృషి చేస్తున్నాను. 2009 లో మామ ప్రోత్సాహంతో సొంతంగా చిల్లీస్ రెస్టారెంట్‌ను స్థాపించాను. రుచికి, శుచికి కేరాఫ్‌గా ఉండాలని, తాజా ఆహార పదార్థాలతో రుచికరమైన వంటకాలను అందిస్తున్నాం. వినియోగదారుల ప్రోత్సహంతో తిరుపతి కెటి రోడ్డు వద్ద మరో బ్రాంచిని, కడప జిల్లా కేంద్రంలో ఇంకో బ్రాంచిని ఏర్పాటు చేశాం. ఎఫ్ఐసి మార్కు కల్గిన పదార్థాలను మాత్రమే వినియోగిస్తూ, ప్రతి పదార్థం తాజాగా ఉంటేనే వాడుతున్నాం. అనతికాలంలోనే మాంసహార పదార్థాలకు, బిర్యానికి చిల్లీస్ తిరుపతి నగరంలో ఓ బ్రాండ్‌గా ఎదగడం సంతోషంగా ఉంది. కేవలం ఎనిమిది మంది సిబ్బందితో ప్రారంభమైన మా హోటల్ రంగం నేడు 160 మందికి పైగా సిబ్బందికి ఉపాధి కల్పించాం. త్వరలోనే శ్రీకాళహస్తి, నేంద్రగుంట వద్ద మా రెస్టారెంట్లను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. తాజా ఆహార పదార్థాలు కావాలనుకునే వారు 0877 6457888, 9248026999 నెంబర్లను సంప్రదించాలి.

సమాజ సేవలోనూ నావంతు

పది మందికి ఉపాధి కల్పించాలని వ్యాపార రంగంలోకి అడుగిడిన నేను సేవా రంగంలోనూ ప్రవేశించాను. కరోనా వంటి విపత్కర పరిస్థితులను చూసి, నా స్నేహితులతో పాటు అనేక మంది దగ్గర వ్యక్తులు కరోనా బారిన పడి మృతి చెందడాన్ని కళ్ళారా చూశాను. దీంతో చలించిపోయాను. డబ్బులు సంపాదించి ఏమి చేసుకుంటాం..? తోటి వారికి శక్తి మేరకు సహాయ పడితే కనీస ఆత్మతృప్తి అన్నా ఉంటుందని భావించాను. కరోనా కాలంలోనే ప్రతి రోజూ వందలాది మందికి నాణ్యమైన, పౌష్టికాహారాన్ని ఉచితంగా అందించాను. స్నేహితులు, శ్రేయోభిలాషులు సహకరిస్తామన్నారు. అయినా నా సొంతడబ్బులతోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ప్రాణపాయ స్థితిలో ఉన్న రోగులను ఆదుకునేందుకు తరుచూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నగర వాసులకు ఫిల్టర్ వాటర్‌ను చలివేంద్రాల్లో క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నాం. చలివేంద్రాలంటే కుండలు పెట్టి, తప్పుకోవడం కాకుండా.. చల్లని క్యాన్ వాటర్‌ను అందుబాటులో ఉంచి, ఓ వ్యక్తిని ఆ షెల్టర్లో ఉంచి పాదచారులకు, వాహనదారులకు, వేసవి ఉపశమనం పొందేందుకు మంచి నీళ్లు అందిస్తునా.

వ్యాపారంలో వచ్చే ఆదాయంతో చలివేంద్రాలు నిర్వహణ, అందులో పని చేసే వారికి వేతనం అందజేస్తున్నాను. ఇప్పటికే తిరుపతి ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంటు పక్కన, కపిలతీర్థం రోడ్డులో, బస్టాండు, రైల్వేస్టేషన్‌కు సమీపంలోని ఈస్టు పోలీసు స్టేషన్ వద్ద, కడప జిల్లా కేంద్రంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశాం. తిరుపతి గంగజాతర సందర్భంగా వారం రోజులుగా చలివేంద్రాల వద్ద పౌష్టికాహారంతో కూడిన అంబిలిని సైతం వేలాది మందికి ఉచితంగా అందిస్తున్నాం. సంస్థ వార్షికోత్సవం సందర్భంగా పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర సరుకులు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి ఒక్కరూ తమ వంతు సమాజానికి సహాయం అందించి, సమ సమానత్వం కోసం కృషి చేయాలి.

'శ్రీవారి' సేవ నా అదృష్టం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఓం నమో వెంకటేశాయ అని స్మరణతో సుందర తిరుమల - శుద్ధ తిరుమల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కే వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగానికి కేటాయించిన నిడివి మేరకు అలిపిరి దగ్గర నుంచి మూడో కిలోమీటర్ వరకూ రోడ్ ప్రక్కన అంతా క్లీన్ చేయడానికి జిల్లా యంత్రాంగం తరఫున జిల్లా అధికారులతో సహా దాదాపు 100 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొన్నారని తెలిపారు. ఉదయం 6 గంటలకు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ఎన్వి రమణ, టీటీడీ ఈవో ధర్మారెడ్డి తో కలిసి ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు వచ్చిన అధికారులంతా తమకు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారు వారికి సేవ చేయడానికి వచ్చిన అవకాశంగా భావించి స్వచ్ఛందంగా వచ్చిన వారే అని ఎంతో అంకిత భావంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని తెలిపారు. ఇక్కడ రహదారి పైన బాగానే ఉందని, దాని ప్రక్కల పారవేసిన ప్లాస్టిక్ కవర్లు బాటిల్స్ తదితర ప్లాస్టిక్ సంబంధిత వస్తువుల చెత్త విరివిగా ఉన్నాయని, వాటిలో నేడు ప్లాస్టిక్ బాటిల్స్ నాన్ డీ గ్రేడబుల్ ప్లాస్టిక్ కవర్స్ తదితర చెత్తను వేరు చేసి సేకరించి వాటిని టిటిడి వారి వాహనాలలో లోడ్ చేయించి పంపడం జరిగిందని అన్నారు.

నేడు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఒకవేళ ఈరోజు పూర్తి కాకపోతే, ఎన్నిసార్లు అయినా సరే జిల్లా యంత్రాంగం తమకు ఇచ్చినటువంటి నిడివిని మొత్తం పరిశుభ్రంగా ఉంచడానికి తమ వంతు కషి చేయడానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, డీఎస్ఓ సతీష్ రెడ్డి పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్యతో పాటు 25 మంది సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు ఎమ్మెల్యేపై
దిశా కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీపతిబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులపై, వారి వస్త్రధారణపై, అసభ్యంగా, అవహేళనగా, వ్యంగ్యంగా మాట్లాడుతూ మానసిక వేధింపులకు గురిచేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలంపై దిశా కేసు నమోదు చేయాని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దిశా చట్టం నిజంగా అమలులో ఉంటే, వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని హితవుపలికారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉండి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీలో టిక్కెట్టు రాదనే అసహనం, తాను గొప్ప నాయకుడని అధిష్టానంలో మెప్పుకోసం తప్పితే ఎమ్మెల్యే ఆరోపణలు నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ తాను 1997 న తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందానని చెప్పారు. అప్పటినుండి ప్రజల అభీష్టం మేరకే రాజకీయాలలో కొనసాగుతున్నాని తెలిపారు. 2001లో తాను ఎంపీపీగా ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేసిన ఆదిమూలానికి అప్పుడురాని సందేహం ఇప్పుడు రావడం, కులం పేరుతో దూషణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిక్కెట్టు రాదనే మనోవ్యాఖులతకు గురిఅవుతూనే అర్థం లేని విమర్శలు చేస్తున్నారని తెలుస్తుందన్నారు. తాను బ్రీటీష్ పాఠశాలలో చదవటంతో క్రిష్టియానిటీ అనే పదం వచ్చిందన్నారు. క్రిష్టియానిటీ అనేది కులం కాదని ఎమ్మెల్యే ఆదిమూలం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తాను ఆదిఆంధ్ర ఎస్సీ కులానికి చెందిన వ్యక్తినని చెప్పుకొచ్చిన ఆమె.. ఇకనైనా ఎమ్మెల్యే ఆదిమూలం సందేహాలు నివృత్తి అవుతాయని అనుకుంటున్నామని పేర్కొన్నారు.

అనురాగంలో సామవేదం 'అమ్మ'

పల్లవి॥ వేద పురాణాదులన్నీ వేనోళ్లతో కీర్తించినా
సదమల అనురాగములో సామవేదమే 'అమ్మ' ॥వేద॥
చరణం॥ అమ్మలేని వైకుంఠం అక్కరలేదన్న ధృవుడు
కమ్మనైన తల్లిపాట కావాలన్నాడు భవుడు
ఇంద్రుడైన, చంద్రుడైన ఇలలో రాజన్యులైన
తల్లిమాట వేదమంటు తనిసినారు మాన్యులైన ॥వేద॥
చరణం॥ సంసారపు బాధ్యతలను సాధ్విగానె ఎత్తుకొని
సహనమునే అద్దుకొని బిడ్డలనే హత్తుకొని
అనురాగపు దేవతగా తన భర్తచే మెప్పుకొని
నిలచిన ఆ దేవతవై నీరాజనమందుకొను ॥వేద॥
చరణం॥ తన బిడ్డల చదువులకై తరలే కేంద్ర బింధువుగా
మన వారను భావనతో మసలినావు సింధువుగా
చెలిమికి కలిమికి నీవే చెరగరాని స్త్రీ రూపంగా
'రెండు గోత్రాల' సిరుల మెండుగా అపురూపంగా ॥వేద॥
చరణం॥ హారతి కర్పూరంలా వెలుగులు పంచిన అమ్మ
అణువణువున ఆర్ద్రతతో అంతానిండెను అమ్మ
రాముడైన శ్యాముడైన రామానుజుండైనా
సదా సర్వదా "తల్లికి సాహో" అని అనవలెగా !!

పండిత కవి : ఓ.రవి, ఉపాధ్యాయులు, పుత్తూరు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కల్లివెట్టు ఉన్నత పాఠశాలలోని తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు ఒబ్బుదేవి ప్రసాద్, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు నాదెండ్ల మురళీలు ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాలతో కరపత్రాలు ముద్రించి పాఠశాల పరిధిలోని తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల్లో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, రాగి జావ పంపిణీ, పదో తరగతికి ప్రత్యేక తరగతులు, ట్యాబ్ సౌకర్యంతో బైజుస్ పాఠాలు బోధన వంటి వివరాలతో కూడిన కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

రోడ్డు విస్తరణ బాధితులకు అన్యాయం చేస్తే ఊరుకోం..!

ప్రజాశక్తి-తిరుచానూరు: పద్మావతీపురం పంచాయతీ పరిధిలో రోడ్ల విస్తరణలో భాగంలో ఇళ్లు కోల్పోయిన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ హెచ్చరించారు. శనివారం ఇళ్ల స్థలాల కోసం చదును చేసిన స్థలంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ ఆందోళనకారులకు తిరుచానూరు పోలీసులకు తీవ్రమైన వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిపిఐ కార్యకర్తలను సీఐ సుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో బలవంతంగా లాక్కెళ్లి అరెస్టులు చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నదియా, తిరుపతి నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి , ఎం రామకష్ణ, పద్మనాభరెడ్డి, ఎన్ శివా, కె వై రాజా , ఉదయ్ కుమార్ బండి చలపతి, ఎన్. మంజుల, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయి, హరికష్ణ, సురేష్, వెంకటేష్, పూర్ణ, నాగరాజు, డప్పు సూరి, సుబ్బు, మునేశ్వర్, లక్ష్మి, ప్రమీల, విజయ, అలివేలు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన నాయకులు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పట్టణంలో ఇటీవల కొత్తగా డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భవ్య కిషోర్‌ను ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కమిటీ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామ్‌జేరి రాజు మండలంలోని దళితుల సమస్యలు, దళితులపై జరుగుతున్న దాడులను డీఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు డాక్టర్ గౌరి, ఐజయ్య, జూలియన్ రాజు, మునిరత్నం, ఉప్పు రమణా, మహిళ కమిటీ సభ్యులు ధనమ్మ, వరలక్ష్మి, సరస్వతి, భారతి, వేణు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పది ఫలితాల్లో చిన్మయా విద్యాలయ విజయకేతనం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శ్రీసిటీ చిన్మయా విద్యాలయ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి 39 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరై అందరూ పాసైనట్లు చిన్మయ విద్యాలయ ప్రిన్సిపల్ కె.భువనేశ్వరి తెలిపారు. వి.కేశవ్ 95.2 శాతం(476/500), ఎం.ఎం.సోహన్ కష్ణ 94 శాతం (470/500), ఎన్.జి.దేవాజ్ ప్రభాకర్ 91.8 శాతం (459/500), ఎం.చరణ్ తేజ 91.6 శాతం (458/500), ఎస్.పార్థసారథి గౌడ్ 90 శాతం(450/500) అత్యుత్తమ మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారని వివరించారు. మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, ప్రిన్సిపల్, టీచర్లకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలను ట్రెజరీలో అందించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏటా విశ్రాంత ఉద్యోగులు జీవన ప్రమాణ పత్రాల జాబితాను ట్రెజరీకి అందజేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు భాస్కర్‌రాజు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పుత్తూరు వారి నెలసరి సమావేశం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో భాస్కర్ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆడిటర్ రామకష్ణ, రామకృష్ణ సమితి పుత్తూరు అధ్యక్షులు శ్రీకటారి మునికష్ణ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మునికష్ణ ప్రార్థన గీతం ఆలపించి అందరికీ శ్రీ రామకష్ణుల దివ్య స్పర్శ ' పుస్తకాన్ని అందజేశారు. ఆడిటర్ రామకష్ణ విలువలతో కూడిన ఆదాయపు పన్ను విషయాలను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సహాధ్యక్షులు కేవీ యుగంధర్‌రాజు, పెన్షనర్స్ సంఘ గౌరవాధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, పెన్షనర్ల ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, రామలింగం, రమేష్, గుణశేఖర్ రెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రారాజు, భాస్కర్ రెడ్డి, మేకల సుబ్రమణ్యం, వెంకటకృష్ణ, చంద్రశేఖర్ వర్మ, రామమూర్తి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని కర్ణాలవీధి, బాలాజీనగర్ ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, పురపాలక కమిషనర్ సాయినాథ్ పర్యటించారు. కర్ణాల వీధి నుంచి బాలాజీనగర్ కు వెళ్లే దారిలో కల్వర్టు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతుండేవారు. దీంతో స్పందించిన ఆమె కల్వర్టు నిర్మాణాన్ని పీఎస్నార్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్నారు. శనివారం ఆ పనులు పరిశీలించారు. సాయి, స్వరూప్, సూర్యనారాయణ, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు అర్బన్, రూరల్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో మెహబూబీ తెలిపారు. రెండు అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు, ఐదు సహాయకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని .. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఓజిలి ఎంఈవోను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-సత్యవేడు: ఓజిలి మండల ఎంఈవో శైలజను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ సత్యవేడు డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండు చేశారు. శనివారం సత్యవేడులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంఈవో గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతూ వచ్చారన్నారు. చాలీచాలని జీతం తీసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మని తొలగించడంపై ఎంఈవో శైలజను సస్పెండ్ చేయాలని కోరారు. ఈమె వ్యవహార శైలి అధికార పార్టీ నాయకురాలుగా ఉందని.. ఆ మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మ ను ఉన్నట్టుండి ఏ కారణం లేకుండా తొలగించడం ఏంటని ప్రశ్నించారు. 19 రోజులుగా కార్మికురాలు పోరాడుతూ ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సమస్యను పరిష్కరించకుంటే పెదఎత్తున చలో ఓజిలి కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అవసరం వస్తుందని హెచ్చరించారు.

19వ రోజుకు చేరిన వజ్రమ్మ నిరసన దీక్ష

ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి మండలంలోని పున్నేపల్లి గ్రామనికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు మైలారీ వజ్రమ్మ చేపట్టిన రిలే దీక్షలు 19వ రోజుకు చేరుకున్నాయి. అయితే జిల్లా అధికారులు స్పందన లేకపోవడం సిగ్గుచేటని సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు విమర్శించారు. ఈ మండలంలో అధికార యంత్రాంగం వైసీపీ పార్టీకి ఊడిగం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు తొత్తుగా మారిన ఓజిలి ఎంఈవోను సస్పెండ్ చేసి ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపు హిమజ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో ఈనెల 15న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఉద్యోగమేళా జరుగుతుందని కళాశాల ఛైర్మన్ సురేంద్రరాజు తెలిపారు. 2020 నుంచి 2023 సంవత్సరాలలో ఏదైనా డిగ్రీ కోర్సు పూర్తిచేసిన నిరుద్యోగ యువత ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9652448227, 6301937501 లను సంప్రదించాలని కోరారు.

17న గూడూరు ఐటీఐ కళాశాలలోనూ...

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములురెడ్డి తెలిపారు. ఐదో తరగతి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ , డిప్లొమా, ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్‌నంబరు 7799300659 ను సంప్రదించాలని కోరారు.

సామాన్యులు ఏమీ కొనేటట్టు లేదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జగన్మోహన్‌రెడ్డి పాలనలో సామాన్యుడు ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటా విమర్శించారు. నేను-నా నియోజకవర్గ ప్రజలు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె పట్టణంలోని బి.పి.అగ్రహారంలో పర్యటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. కరెంట్, గ్యాస్ ధరలు పెంచడం వల్ల ప్రజలు తీవ్రంగా కష్టాలు పడుతున్నారని వాపోయారు. పథకాలు కొద్ది మందికే పరిమితం చేసి, అర్హత ఉన్న పేదలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ సీఎం అయితే యువతకి, పేద ప్రజలకు మంచి జరుగుతుందనీ , రానున్న ఎన్నికల్లో వైసీపీ అరాచకానికి చరమగీతం పాడాలని కోరారు. శివకుమార్, వినోద్ కుమార్, వెంకటరమణ యాదవ్, నితీష్ కుమార్, వెంకటేష్, చంద్ర శేఖర్ యదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్రను జయప్రదం చేద్దాం..!

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు యువ నాయకులు మాజీ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నారని.. ఈనెల 15వ తేదీకి వంద రోజులు పూర్తి అవుతుందని తెలిపారు. దీంతో గూడూరు కోర్ట్ సెంటర్ నుండి చెన్నూరు బస్టాండ్ వరకు సంఘీభావ పాదయాత్ర 3 వేల మందితో నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

కానూరురాజుపాళెంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పెళ్లకూరు: కానూరురాజుపాలెం గ్రామంలో శనివారం సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అభివద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నకు ఓటు వేసి మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పిటిసి ప్రిస్కిల్లా, వైసీపీ మండల ప్రెసిడెంట్ సుధాకర్, చైతన్య కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకంరాజు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని.. పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ఇంజినీర్ నరేంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. తారకరామ స్టేడియం నుండి టౌన్ క్లబ్ కూడలి మీదుగా నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ వరకు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నేషనల్ అట్మాస్ఫరిక్ రీసెర్చ్ లాబరేటరీ చీఫ్ వికాస్ సింగ్ పాల్గొని విద్యార్థులు, వి బైక్ క్లబ్ ప్రతినిధులు, ప్రజలతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహాయ పర్యావరణ ఇంజినీరు వి. మదనమోహనరెడ్డి, పి.వి.కిషోర్‌రెడ్డి, యం.శశికళ, ఆర్.కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ బ్లడ్ డొనేషన్ వాహనం వితరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో యస్‌వీ యస్ బ్లడ్ సెంటర్‌లో మొబైల్ బ్లడ్ డొనేషన్ వాహనాన్ని శుక్రవారం దిశ కాటమరాజు, వర్చో ఫౌండేషన్ ప్రవీణలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటమరాజు మాట్లాడుతూ యస్ వి యస్ బ్లడ్ సెంటర్ సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రవీణ మాట్లాడుతూ యస్ వి యస్ బ్లడ్ సెంటర్ చైర్మన్ ఎల్ ఆర్ నాయుడు సేవలు బాగున్నాయని..తమ సంస్థ వర్చో ఫౌండేషన్‌తో బ్లడ్ డొనేషన్ వాహనాన్ని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరికుమార్‌రెడ్డి, మోపూరు భాస్కర్‌నాయుడు, శ్రీనివాస్, రఘు, చక్రాల ఉష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వలస పక్షుల దినోత్సవం

ప్రజాశక్తి- దొరవారిసత్రం: మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రంలో శనివారం ఘనంగా ప్రపంచ వలస పక్షుల దినోత్సవం వేడుకలను సూళ్లూరుపేట డిఎఫ్ఓ శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ ప్రపంచ వలస పక్షుల దినం కావడంతో పక్షుల కేంద్రానికి ఎక్కువగా విదేశీ వలస పక్షులు ఇక్కడికి వస్తాయన్నారు. గతంలో నేలపట్టు గ్రామంలో పంట పండి ఇంటికి వస్తే పక్షుల పండగ రైతులు ఘనంగా చేసేవారని తెలిపారు. అనంతరం పక్షుల కేంద్రం సిబ్బంది వలస పక్షులను కాపాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. వీరితోపాటు రేంజర్ వరప్రసాద్, కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన

ప్రజాశక్తి- గూడూరు టౌన్: గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళశాల సమీపంలోఇ శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో పదో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన ఉత్సాహంగా జరిగింది. ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త రవీంద్రరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కషి చేసిన దాచూరి రామిరెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా తిరుపతిలో జరుగుతున్న స్మారకోపన్యాస సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదర్శ ఎమ్మెల్సీగా పేరుపొందిన దాచూరి రామిరెడ్డి శాసనమండలి వేదికగా విద్యారంగ అభివద్ధి కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం శ్రమించారని, రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలను కల్పించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాలరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిర్మల, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదన్‌రెడ్డి, శేఖర్, ప్రభాకర్, నాయకులు విజయకుమార్, భాగ్యలక్ష్మి, నాగరాజు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మకు పుట్టింటి సారె

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, తితిదే జేఈవో వీరబ్రహ్మం చేతుల మీదుగా శ్రీగోవిందరాజులస్వామి ఆలయం నుంచి అమ్మవారికి సారె శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయ ధర్మకర్త మండలి ఛైర్మన్ గోపియాదవ్ భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తితిదే జేఈవో వీర బ్రహ్మం ఆధ్వర్యంలో భక్తి యాత్ర నిర్వహించారు. వీధులన్నీ వేపాకు తోరణాలతో పాటు మామిడి, అరటి తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాప్రదర్శలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. గోవిందరాజ స్వామి ఆలయం నందు నిర్వహించిన ప్రత్యక పూజా కార్యక్రమాల్లో టీటీడీ అధికారులు, నగర మేయర్ డాక్టర్ శిరీష్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి, తితిదే అధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంటలోని రైల్వే స్టేషన్ వద్ద సౌత్ క్యాబిన్ ప్రాంతంలో శనివారం ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రమాదం జరగలేదు.

లోక్ అదాలత్‌లో కేసులకు శాశ్వత పరిష్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: లోక్ ఆదాలత్ కార్యక్రమంతో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 42 కేసులను అక్కడికక్కడే పరిష్కరించగా.. రూ.5.40 లక్షలు రికవరీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

గూడూర్ రూరల్ : గూడూరు పట్టణంలోని కోర్డు భవనంలో జాతీయ మెగా లోక్ అదాలత్ ను ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం, సబ్ జడ్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీ అయ్యే కేసులను కక్షిదారులతో మాట్లాడి వారి అంగీకారంతో కేసులను కొట్టి వేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న గొడవలకు కేసులు పెట్టుకొని కోర్టులు చుట్టూ తిరుగుతూ డబ్బును , సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకొని ప్రశాంతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, లాయర్లు, పోలీసులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: కక్షదారులు పంతాలకు పోయి కోర్టు చుట్టూ తిరిగి సమయాన్ని వథా చేసుకోకండని.. పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ రాఘవేంద్ర అన్నారు. శనివారం పుత్తూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను మండల న్యాయ సేవాధికారి, సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసమే ప్రభుత్వం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వేణుగోపాల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జానకి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌రెడ్డి , న్యాయవాదులు పురుషోత్తం, సంజీవి, మురుగేషన్‌రెడ్డి, కక్షదారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.